సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం | 10 | జనవరి | 2025


రుడా కార్యదర్శిగా సాయిబాబా

రాజమహేంద్రవరం సిటీ: మద్దిపాటి వెంకట రత్న సాయిబాబా రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన మంగళగిరి నుంచి ఇక్కడకు వస్తున్నారు.



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డి.శంకరీదేవి (విశాఖపట్నం) పేరిట ఆమె బంధువులు గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

పోషణ్ ప్లస్‌తో రక్తహీనతకు చెక్



విద్యార్థినులకు ఆహారం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కౌమార దశలోని ఆడపిల్లల్లో రక్తహీనతకు చెక్ పెట్టేందుకు పోషణ్ ప్లస్ కార్యక్రమం అమలు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా యంత్రాంగం, వైద్య, ఆరోగ్యం, ఇతర సమన్వయ శాఖల ఆధ్వర్యాన నగరంలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో ఈ కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వసతి గృహాల్లోని బాలికలకు పోషణ్ ప్లస్ కింద ఐరన్ మాత్రలతో పాటు మునగాకు పొడి అందజేస్తున్నామన్నారు. రక్తహీనతతో కళ్లు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతూంటాయని, దీని నివారణకు మనం తీసుకునే ఆహారంలో ఐరన్ పోషకాలు అందుతున్నయో లేదో నిర్ధారించుకోవడం ముఖ్యమని చెప్పారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కౌమార దశలో ఉన్న 2,793 బాలికలకు మునగాకు పొడి అందజేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కలెక్టర్ స్వయంగా ఆహారం వడ్డించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీలక్ష్మి తదితరులు

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ అండర్–17 పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొన్న దేవరపల్లికి చెందిన ఓరుగంటి సాహితీశ్రీ, కె.లీలాసాయి ప్రసన్న సత్తా చాటారు. సాహితీశ్రీ ఐదు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేసి 200 పరుగులు సాధించగా, లీలాసాయి ప్రసన్న బౌలింగ్‌లో ప్రతిభ చూపింది. వీరిద్దరూ ఈ నెల 28న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి టోర్నమెంటులో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని పీడీ ఓరుగంటి నాగరాజు తెలిపారు. సాహితీశ్రీ గతంలో జైపూర్, భువనేశ్వర్‌లో జరిగిన అండర్–15 పోటీల్లో ప్రతిభ చూపింది. ఇదిలా ఉండగా, గత నెల 27, 28, 29 తేదీల్లో కేరళలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీల్లో కె.వర్షిణి, వి.ప్రవీణ్‌లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జట్లలో ఆడి ప్రతిభ చూపారని నాగరాజు తెలిపారు. వర్షిణి గతంలో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిందన్నారు. ఈమె ఫిబ్రవరిలో విజయవాడలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటోందని చెప్పారు. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీలక్ష్మి, పీడీ నాగరాజు, పీఎంసీ చైర్మన్ వేముల రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

పంతం.. నీదా.. నాదా.. సై!





- రాజమహేంద్రవరం సిటీ టీడీపీలో మళ్లీ వర్గపోరు
- ఆదిరెడ్డి వర్సెస్ బుచ్చయ్య!
- మొన్న మందుల షాపు.. నేడు పేపరు మిల్లు..
- కార్మిక నేతకు ఫోనులో ఆదిరెడ్డి బెదిరింపులు
- సీఎం చంద్రబాబు వద్దకు పంచాయితీ!



ఆదిరెడ్డి వాసు | ఆదిరెడ్డి అప్పారావు | గోరంట్ల బుచ్చయ్య చౌదరి

సాక్షి, రాజమహేంద్రవరం: మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు.. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మధ్య మళ్లీ విభేదాల అగ్గి రగులుతోంది. ఆ మధ్య మున్సిపల్ ఎన్నికల నిర్వహణ.. రెండు రోజుల కిందట రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్)లో మందుల షాపు కేటాయింపుపై ఇరు వర్గాల మధ్య వివాదాలు ఏర్పడగా.. తాజాగా పేపరు మిల్లు నేతను ఆదిరెడ్డి ఫోనులో బెదిరించడంతో వారి మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఈ బెదిరింపుల వ్యవహారాన్ని ఆ నేత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ఈ వరుస సంఘటనలు టీడీపీలో కలకలం రేపుతున్నాయి.

మందుల దుకాణంపై వివాదం

రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రభుత్వ జనరిక్ మందుల దుకాణాన్ని డీఆర్‌డీఏ ఆధ్వర్యాన మహిళా సంఘాలకు కేటాయిస్తున్నారు. 2019లో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వర్గానికి చెందిన కాశీకృష్ణ మహిళా శక్తి సంఘానికి ఐదేళ్ల పాటు నిర్వహించుకునే విధంగా అప్పగించారు. ఈ దుకాణం నిర్వహిస్తున్న ఆ సంఘం అధ్యక్షురాలు పిల్లా తనూజకు గత ఏడాది ఆగస్టుతో ఐదేళ్ల గడువు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో షాపు ఖాళీ చేయాలంటూ ఆమెకు జీజీహెచ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే, జిల్లా సమాఖ్య తమకు 2029 వరకూ రెన్యువల్ చేసిందని, అందువలన ఆ దుకాణాన్ని ఖాళీ చేసేది లేదని బుచ్చయ్యకు చెందిన వర్గానికి చెందిన తనూజ ఒక్కసారిగా ఆందోళనకు దిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఆయన తండ్రి అప్పారావు తమ అనుచరులతో కలిసి దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించింది. గోరంట్ల వర్గంలో ఉండటంతో తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా ఆ షాపును తమకు కేటాయించారని మరో వర్గానికి చెందిన మహిళ స్నేహాంజలి యాదవ్ చెబుతోంది. దీంతో ఈ షాపు వివాదం కాస్త గోరంట్ల వర్సెస్ ఆదిరెడ్డి అన్నట్లుగా మారింది. ప్రస్తుతానికి ఈ షాపు కేటాయింపు వ్యవహారాన్ని కలెక్టర్ వాయిదా వేయడంతో వివాదానికి తాత్కాలికంగా తెర పడినట్లయింది. ఇదిలా ఉండగా నిబంధనల మేరకు అర్బన్ నియోజకవర్గ పరిధిలోని వారికే ప్రభుత్వాసుపత్రి జనరిక్ మెడికల్ స్టోర్ ఇవ్వాలంటూ కలెక్టర్, డీఆర్‌డీఏ అధికారులు స్పష్టం చేశారని ఆదిరెడ్డి అప్పారావు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు గోరంట్ల, తాము నియోజకవర్గాల పరిధికి కట్టుబడి పని చేస్తున్నామంటూనే.. మెడికల్ షాపు తమ వర్గానికే దక్కాలనే సంకేతాలు ఇస్తున్నారు.

పేపర్ మిల్లు నేతకు బెదిరింపులు?

ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం పేపర్ మిల్లు వ్యవహారంలో కార్మిక సంఘం నాయకుడు ప్రవీణ్ చౌదరిని ఆదిరెడ్డి అప్పారావు ఫోన్‌లో బెదిరించిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. వారి మధ్య జరిగిన ఫోను సంభాషణ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది. 'నువ్వు బుచ్చయ్య మాట విని వైఎస్సార్ పార్టీలోకి వెళ్లావు. ఏం పీకావు? మా మీద కామెంట్లు చేశావు. విడిచిపెడతాననుకోకు. కామెంట్లకు పనిష్మెంట్లు ఉంటాయి. ఐదేళ్లు విర్రవీగిపోయారు. నా తొక్కలో భరత్. మీరందరూ ఏం చేయలేరు. నువ్వు, బుచ్చయ్య చౌదరి ఏం చేస్తారు? వైఎస్సార్ సీపీ పదేళ్లయినా లేవదు. మిమ్మల్ని అంత తేలిగ్గా వదిలిపెడతామని అనుకోకు. ఆ రోజు హెచ్చరికలు చేస్తూ ప్రెస్‌మీట్లు పెట్టావు. ఏమనుకుని పెట్టావు? నీ తాహతు ఏంటి? నువ్వేంటి? నీ ఇల్లు ఎక్కడో తెలుసుకున్నాను. నీ సంగతి చూస్తాను' అంటూ బెదిరింపులకు దిగినట్లు ఆ ఫోను సంభాషణలో ఉంది. అయితే, దీనిపై అప్పారావు గురువారం ప్రెస్‌మీట్ పెట్టి వివరణ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రావడంతో పేపర్ మిల్లు కార్మికుడు ప్రవీణ్ చౌదరి తమ వద్దకు వచ్చి మళ్లీ టీడీపీలో చేరుతానని చెప్పాడన్నారు. ప్రవీణ్ చౌదరితో భరత్ ఏం పీకాడని తాను వ్యాఖ్యానిస్తే.. మార్గాని భరత్ ఎడిట్ చేసి.. బుచ్చయ్య చౌదరి ఏం పీకుతారని అన్నట్లుగా ఎడిట్ చేసి 'బెదిరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ' అని ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. బుచ్చయ్య చౌదరికి, తమకు మధ్య సంబంధాలు బాగానే ఉన్నాయన్నారు. ఏది ఏమైనా ఫోన్ కాల్ ఎలా ఎడిట్ చేస్తారనే ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. అప్పారావు అలా తిట్టకపోతే ఎందుకు వివరణ ఇచ్చారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. దీనిపై బుచ్చయ్య ఎలా స్పందిస్తారోననే ఆసక్తి నెలకొంది. బుచ్చయ్య సీరియస్‌గా తీసుకుంటే మాత్రం టీడీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ఆదిరెడ్డి అప్పారావు తనను ఫోనులో బెదిరిస్తున్నట్లు సీఎం చంద్రబాబు దృష్టికి ప్రవీణ్ చౌదరి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు.

కొన్నేళ్లుగా ఇదే తంతు

ఆదిరెడ్డి అప్పారావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి మధ్య కొన్నేళ్లుగా వర్గ పోరు నడుస్తూనే ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బుచ్చయ్య సిటీ నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. అయితే, నియోజకవర్గ టీడీపీ నేతల సమావేశంలో ఆదిరెడ్డి వాసు సిటీ నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. సిటీ నియోజకవర్గంలో తనకు మద్దతు తెలిపే కార్పొరేటర్లతో బుచ్చయ్య అప్పట్లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం సైతం వివాదాస్పదంగా మారింది. అలాగే, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణలో గోరంట్ల, ఆదిరెడ్డి వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన విలీన గ్రామాలతో కలిపి కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలని గోరంట్ల పట్టుబడుతూండగా.. విలీనం లేకుండానే ఎన్నికలకు వెళ్లాలని ఆదిరెడ్డి వర్గం వాదిస్తోంది. ఈ వ్యవహారం ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఇరు వర్గాలపై సీఎం చంద్రబాబు సైతం అసహనం వ్యక్తం చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలిసి కట్టుగా పోవాల్సింది పోయి రెండు వర్గాలుగా విభేదాలకు దిగడం తగదని గట్టిగా చెప్పినట్లు తెలిసింది.

ఆరుగురి మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణం



విలేకర్లతో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

- బాధిత కుటుంబాలకు తక్షణమే రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే తలారి డిమాండ్

చాగల్లు: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయిన ఘటనతో భక్తుల మనోభావాలు తీవ్రంగా గాయపడ్డాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మరణించిన భక్తుల ఆత్మలకు ఆ దేవదేవుడు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. మండలంలోని నందిగంపాడు గ్రామంలో గురువారం జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. అవకతవకలు, అక్రమాలు, ప్రతిపక్షంపై దాడులతో పాలన మొదలు పెట్టిన కూటమి ప్రభుత్వం.. చివరకు పరమ పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదానికి కూడా మచ్చ తెచ్చే విధంగా కల్తీ నెయ్యి ముద్ర వేసిందని అన్నారు. కావలసిన వారి ఖాతాలో నెయ్యి సరఫరా కాంట్రాక్టు వేసుకునేంత వరకూ అహర్నిశలూ శ్రమించిందని దుయ్యబట్టారు. అర్ధరాత్రి బూతు కథనాలు ప్రసారం చేస్తూ.. తన చానల్ టీఆర్పీ రేటింగ్ పెంచుకునేందుకు ప్రయత్నించిన టీవీ–5 అధినేత బీఆర్ నాయుడును టీటీడీ చైర్మన్‌గా నియమించి మరింత ఆక్షేపణీయమైన పనికి కూటమి ప్రభుత్వం పాల్పడిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క పొరపాటుకూ తావు లేకుండా భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించడంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ ప్రశంసనీయమని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చావులేనని, గతంలో కూడా ఆయన నిర్లక్ష్యం వల్లే గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగిందని గుర్తు చేశారు. తిరుపతి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భక్తులకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, కౌన్సిలర్ కంఠమని రమేష్, నేతలు ఉప్పులూరి సూరిబాబు, మద్దుకూరి రవి, మట్టా వెంకట్రావు, ఉండవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 పొక్లెయిన్ల సీజ్

కడియం: బుర్రిలంక ఇసుక రీచ్ వద్ద అక్రమ మైనింగ్‌కు వినియోగిస్తున్న మూడు పొక్లెయిన్లను సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమగిరి సమీపంలోని బుర్రిలంక వద్ద గోదావరి పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులతో కూడిన 19 మంది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేయరాదని ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా కొంతమంది మారడం లేదని, అటువంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని కలెక్టర్ హెచ్చరించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుటామని, వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. దాడుల్లో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణరెడ్డి, ఆర్ఐ సోనియా, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎ.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



బుర్రిలంక ర్యాంపులో సీజ్ చేసిన పొక్లెయిన్లు

వేంకటేశ్వరస్వామి భక్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- చంద్రబాబుకు వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి రాజా డిమాండ్
- భక్తుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించలేదని విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

మధురపూడి: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి భక్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను, ప్రమాదవశాత్తూ గాయపడిన వారిని గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, భక్తుల భద్రతపై ముందస్తుగా పటిష్ఠ చర్యలు చేపట్టనందువల్లనే తిరుపతిలో తొక్కిసలాట ఘటన జరిగి, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. చంద్రబాబు పాలన ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఈ తరహా సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వానికి ప్రచారార్భాటం తప్ప, ప్రజా క్షేమం పట్టడం లేదని దుయ్యబట్టారు. చంద్రబాబు పబ్లిసిటీ స్టంట్ కారణంగా గత గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాట జరిగి 29 మంది భక్తులు మృతి చెందారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా ఆయన నిర్వహించిన సభల్లో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో అనేక మంది మృతి చెందారన్నారు. మృతుల కోసం చంద్రబాబు కనీసం ఒక్క నిమిషం కూడా బాధ పడిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారన్నారు. తిరుపతి లడ్డూపై దుర్మార్గమైన ప్రచారం చేశారన్నారు. నెయ్యిలో కల్తీ జరిగిందంటూ మాజీ సీఎం జగన్‌పై అసత్య ప్రచారం సాగించి, తిరుమల పవిత్రతను దెబ్బ తీశారన్నారు. సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామిని రాజకీయాలకు వాడుకున్నందువల్లనే ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ధర్మ పరిరక్షణ, హైందవ ధర్మం కోసం పని చేస్తానన్న పవన్ కల్యాణ్ ఈ ప్రమాద ఘటనపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మృతుల కుటుంబాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. ఆయా కుటుంబాలకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని రాజా చెప్పారు.

కేంద్ర పథకాలు సమర్థంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి. చిత్రంలో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేర్చడంలో అధికారులు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని దిశ కమిటీ చైర్‌పర్సన్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా అభివృద్ధి కో ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర పథకాల అమలులో గుర్తించిన లోపాలను అధిగమించేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 37 కార్యక్రమాలపై సమీక్షించామన్నారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని, అయితే ప్రజలు డ్రైయినేజీల కోసం డిమాండ్ చేస్తున్నారని, వాటికి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కంపొనెంట్ నిధులు సమర్థంగా ఖర్చు చేస్తామన్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో తొలి దశ పనులు 60 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన లక్ష్యాలను మార్చిలోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో 20 పాయింట్ల ప్రోగ్రాం చైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాండలీకాలను గ్రంథస్తం చేయిస్తాం

- తెలుగు భాషా వికాసానికి కృషి
- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలు



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న చైతన్యరాజు



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

రాజానగరం: దేశ భాషలందు తెలుగు లెస్స అని ఏనాడో కీర్తినందుకున్న మన మాతృ భాష పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు, భాషా వికాసానికి కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ)లో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పద్య, సాంఘిక నాటకాలను ప్రోత్సహించాలని, నంది నాటకోత్సవాలను కూడా పునరుద్ధరించదలచామని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన కాశీపట్నం రామారావు కథా నిలయం (ఉత్తరాంధ్ర), సీపీ బ్రౌన్ మందిరం (రాజమహేంద్రవరం)తో పాటు ప్రసిద్ధ గ్రంథాలయాలను సాంస్కృతిక పర్యాటకం అభివృద్ధిలో భాగంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తద్వారా అక్కడి గ్రంథాలను అధ్యయనం చేసే అవకాశం కలిగి, భాషా వికాసానికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని మాండలీకాలను గ్రంథస్తం చేయాలనే ఆలోచన ఉందని మంత్రి తెలిపారు. తెలుగు భాష వినియోగాన్ని పెంపొందించడంతో పాటు భావితరాలకు చేరువ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని దుర్గేష్ చెప్పారు.

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మాతృ భాషకు ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. తెలుగు భాష ఎంతో ప్రాచీనమైనదని, ఐతరేయ బ్రాహ్మణం, మహాభారతంలో కూడా ఆంధ్రుల ప్రస్తావన ఉందని చెప్పారు. దేశంలో ప్రాచీన హోదా కల్పించిన ఆరు భాషల్లో తెలుగు కూడా ఉందన్నారు. ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగు ప్రపంచంలో 15, మన దేశంలో నాలుగు స్థానాల్లో ఉందని తెలిపారు. తెలుగు భాష గొప్పదనాన్ని ఇతర భాషీయులు గుర్తిస్తున్నారు కానీ, మనమే ఇంకా గుర్తించలేకపోతున్నామని ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి తెలుగు విశిష్టత గురించి చెప్పారన్నారు. తుళు భాష మాట్లాడే శ్రీకృష్ణదేవరాయలే 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ఏనాడో చెప్పారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రజ్ఞావంతులైన పలువురిని ఘనంగా సన్మానించారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించేలా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని వివిధ కళాశాలల చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ద్విసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, కవి అందెశ్రీ, సినీ నటి హేమ, ఆస్ట్రేలియా తెలుగు సంఘం ప్రతినిధి కృష్ణ నడింపల్లి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో. చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కిమ్స్ ఎండీ కె.రవికిరణ్‌వర్మ, పలువురు కవులు, సాహితీవేత్తలు, సినీ కళాకారులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొవ్వూరు: ఐ.పంగిడి శివారు గ్రామమైన గోవర్ధనగిరిమెట్ట వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గోపాలపురం గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు మృతిచెందారు. వెంకటేశ్వరరావు మోటారు సైకిల్‌పై వెళుతుండగా గురువారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. కొన ఊపిరితో ఉన్న ఆయనను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వచ్చిన కొద్దిసేపటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. మృతుడి వద్ద సెల్‌ఫోన్, గోల్డ్ రింగ్, వాచ్, రూ.3,800 నగదు ఉన్నట్లు వైద్యులు నమోదు చేశారు. రూరల్ పోలీసులకు ఆసుపత్రి నుంచి సమాచారం అందించారు. సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

కోవిడ్ నాణేల సేకరణ



హంగేరి దేశం 3,000, 15,000 ముఖ విలువలతో ముద్రించిన కోవిడ్ స్మారక నాణేలు

అమలాపురం టౌన్: కోవిడ్–19 వ్యాక్సిన్ల అభివృద్ధికి మార్గం సుగమం చేసిన ఇద్దరి హంగేరియన్ పరిశోధకుల గౌరవార్థం హంగేరియన్ మింట్ 15,000 ఫోరింట్ వెండి, 3,000 ఫోరింట్ నాన్–ఫెర్రస్ స్మారక నాణేలను 'ది హంగేరియన్ డిస్కవరీ ఫార్మింగ్ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌లకు ఆధారం' అనే శీర్షికతో విడుదల చేసింది. వీటిని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా 10,20 ఫోరింట్ల ముఖ విలువతో కోవిడ్‌పై నాణేలను విడుదల చేసిన దేశం హంగేరి అని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అదే దేశం 15,000 ఫోరింట్ల అత్యధిక ముఖ విలువతో కోవిడ్ నాణేన్ని ముద్రించిందని స్పష్టం చేశారు.

పల్లెల్లో ఘుమాళింపు!

- సంక్రాంతి పిండి వంటల తయారీలో గృహిణులు బిజీ
- సిద్ధమవుతున్న సున్నుండలు, పోకుండలు, కజ్జికాయలు, అరిసెలు
- హోం ఫుడ్స్ షాపుల్లోనూ సంప్రదాయ వంటలకు భారీగా ఆర్డర్లు
- దేశ, విదేశాల్లోని బంధువుల కోసం ప్రత్యేకంగా తయారీ



కొత్తపేటలో సంప్రదాయ పిండి వంటలు తయారు చేస్తున్న మహిళలు



అరిసెలు



కజ్జికాయలు



జంతికలు

కొత్తపేట: సంక్రాంతి వస్తోందంటే తెలుగునాట ప్రతీ ఇల్లు సంప్రదాయ పిండి వంటలతో ఘుమఘుమలాడుతుంటుంది. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో గృహిణులు సున్నుండలు, పోకుండలు, అరిసెలు, కజ్జికాయలు, జంతికలు వంటి పిండి వంటల తయారీలో బిజీ అయిపోయారు. కోవా, కలకండ, డ్రైఫ్రూట్స్, కోవాపూరి వంటి ఆధునిక పిండి వంటలు సైతం సంక్రాంతి వంటకాల్లో చేరి మరింత మాధుర్యాన్ని అందిస్తున్నాయి. పేద, ధనిక తారతమ్యం లేకుండా పల్లెల్లో ప్రతి ఇంటా పిండివంటల తయారీకి ప్రాధాన్యమిస్తారు. స్తోమత మేరకు జంతికలు, సున్నుండలు, బెల్లం ఉండలు, పోకుండలు, రవ్వలడ్లు, పొంగడాలు, అరిసెలు, మైసూర్ పాక్, జంతికలు, కారపు బూందీ తదితర వెరైటీలు చేస్తుంటారు. కొత్తగా వివాహం జరిగిన ఇళ్లలో పిండి వంటల తయారీతో మరింత సందడి నెలకొంటుంది. పండగకు వచ్చే కొత్త అల్లుళ్లు, వియ్యపురాలి కోసం ఎన్నో రకాల పిండి వంటలు సిద్ధం చేస్తుంటారు. దూరప్రాంతాల నుంచి పండగకు వచ్చిన తమ కుటుంబ సభ్యులు, బంధువులకు తిరిగి వెళ్లే సమయంలో వాటిని అందిస్తుంటారు. కొందరు దేశ విదేశాల నుంచి పండగకు వచ్చి తిరిగి వెళుతూ ఈ పిండి వంటలు తీసుకువెళతారు. వారి ద్వారా స్థానికులు అక్కడ ఉన్న తమ బంధువులకు ప్రత్యేకంగా పిండి వంటలు తయారుచేసి పంపుతుంటారు.

హోం ఫుడ్స్ షాపుల్లో సంప్రదాయ పిండి వంటలు

గతంలో ప్రతి ఇంటా మహిళలు, చుట్టుపక్కల వారు కలిసి సంప్రదాయ పిండివంటలు తయారు చేసుకోగా ప్రస్తుత యాంత్రిక జీవనంలో తీరిక లేక ఇళ్ల వద్ద పిండి వంటలు తయారు చేసుకునే తీరిక లేకుండా ఎవరికి వారు బిజీ అయిపోయారు. ఈ నేపథ్యంలో పిండి వంటలు షాపుల్లో కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పట్టణాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెరుగుతోంది. ఏడాది పొడవునా బెంగాలీ, కలకండ, కోవా, కాజూ పేస్ట్ తదితర వెరైటీ స్వీట్స్ తయారుచేసే స్వీట్స్ షాపుల నిర్వాహకులు సంక్రాంతి పండగల్లో సంప్రదాయ పిండి వంటల తయారీకి ప్రాధాన్యమిస్తున్నారు. కోనసీమ ప్రాంతంలో పలు చోట్ల పేరొందిన స్వీట్స్ షాపులతోపాటు చిన్న షాపుల్లోనూ సంక్రాంతి పిండి వంటల తయారీ ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామాల్లో కేటరింగ్ నిర్వాహకులు, స్వీట్స్ తయారీదారులకు పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ కావడంతో మహిళలు షిఫ్టులవారీగా పనిచేస్తున్నారు. రావులపాలెం, ఆత్రేయపురం, అమలాపురం, పీ గన్నవరం, అంబాజీపేట, రాజోలు, ముమ్మిడివరం, అల్లవరం, మల్కిపురం తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా సంప్రదాయ పిండి వంటల దుకాణాలు వెలిశాయి. ఇళ్లల్లో మహిళలు ప్రయాస పడకుండా ఆయా షాపుల్లో రడీమేడ్ పిండి వంటలు కొనుగోలు చేస్తున్నారు.

ఏమిట్రీ వింత..!

ఒకే మొదలుకు రెండు కొబ్బరిచెట్లు



మొదలు ఒకటి, రెండు చెట్లుగా ఇలా..

అల్లవరం: సాధారణంగా ఒక విత్తనం నుంచి ఒకే మొక్క రావడం మనం చూస్తుంటాం. మొలకెత్తిన మొక్క నుంచి అంటుకట్టే విధానం ద్వారా అనేక మొక్కలను సృష్టించడమూ తెలిసిందే. అయితే మొక్క నుంచి అంటుకట్టే విధానం కొబ్బరిలో సాధ్యం కాదు. కొబ్బరి మొక్క తయారు కావాలంటే పండిన కొబ్బరి కాయను భూమిలో పాతి నీరు పెట్టడం ద్వారా రెండు నెలల తర్వాత అంకురం ఏర్పడి క్రమేణా పెరిగి ఐదేళ్ల వయసు తర్వాత కొబ్బరి కాయల కాపు ప్రారంభం అవుతుంది. అయితే దేవగుప్తంలోని రమణాతి పల్లంశెట్టి ఇంటి ఆవరణలో నాటిన కొబ్బరి మొక్క రెండు చెట్లుగా ఎదుగుతోంది. మొదలు ఒకటిగానే ఉన్నా చిగుర్లు మాత్రం రెండుగా విడిపోయి రెండు చెట్లుగా మాను ఏర్పడింది. కాపునకు సిద్ధంగా ఉంది. రెండు చెట్లను విడదీసే ప్రయత్నం చేశామని, అయితే ఒకే మొదలు ఉండడంతో సాధ్యం కాలేదని పల్లంశెట్టి తెలిపారు.

మొక్కజొన్నకు చక్కని అదను



పి.చంద్రశేఖర్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) కొవ్వూరు



ముక్కామలలో ఏపుగా వస్తున్న మొక్కజొన్న పంట



పాడి-పంట

పెరవలి: జిల్లాలో రబీగా మొక్కజొన్న పంట సాగుకు ఇదే అనువైన సమయం. రబీ పంటలో తూర్పుగోదావరి జిల్లాలో నవంబర్ నుంచి జనవరి వరకు ఈ పంటను సాగు చేస్తారు. జిల్లాలో మొక్కజొన్న పంట 1,300 హెక్టార్లలో పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, కోరుకొండ, కడియం మండలాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుచేసే విధానం, విత్తన ఎంపిక, నేలల స్వభావం, ఎరువుల యాజమాన్యం వంటి వివరాలను కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) పి.చంద్రశేఖర్ వివరించారు.

నేలలు

ఈ పంటకు ఇసుక, రేగడి, గరప, లోతైన మధ్య రకపు రేగడి నేలలు అనుకూలంగా ఉంటాయి. నీటిని నిల్వ ఉంచుకుని మురుగునీరు పోయే వసతి గల పంటభూములు దీనికి అనుకూలం.

విత్తన రకాలు

మొక్కజొన్న సాగుకు వాతావరణ పరిస్థితులను, తెగుళ్లను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. ఇందులో స్వల్పకాలిక, మధ్యకాలిక, సంకరజాతి వంగడాలను గుర్తుంచుకుని పంటకాలం 85 రోజుల నుంచి 110 రోజుల వరకు ఉండేలా కావాల్సిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. అశ్విని, హర్ష, వరుణ్, అంబర్ పాప్‌కార్న్, మాధురి, ప్రియా స్వీట్‌కార్న్, అంబర్ శక్తి 1, త్రిశూలత వంటి రకాలు ఉన్నాయి.

విత్తే కాలం, పద్ధతి

రబీ పంటగా నవంబర్ నుంచి జనవరి వరకు విత్తుకోవచ్చు. చేనును బాగా లోతుగా దుక్కి దున్నాలి. ఎకరానికి 27వేల మొక్కలు ఉండేలా విత్తుకోవాలి. సాలుకు సాలుకు మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్లు ఎడం ఉండేటట్టు చూసుకోవాలి. పంటకు సాగునీరు అందేలా, మురుగునీరు పోయేలా బోదెలను ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఉంటే పంట ఎదుగుదల సక్రమంగా జరుగుతుంది. ఎకరానికి సాధారణ రకాలు 7 కిలోల విత్తనాలు, పాప్‌కార్న్, తీపిరకం కండెల కోసం 4 నుంచి 5 కిలోల విత్తనం అవసరం ఉంటుంది.

విత్తనశుద్ధి

ఏ పంట సాగుచేసినా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. దీనివల్ల పంటపై ఆశించే తెగుళ్లను 50శాతం వరకు అరికట్టడంతో పాటు మొలక సాంద్రత ఎక్కువ ఉండి అధిక దిగుబడులు పొందవచ్చు. కిలో విత్తనానికి 5 గ్రాములు ఇమిడాక్లోఫ్రిడ్ లేదా 3 గ్రాముల మాంకోజబ్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి.

నీటి యాజమాన్యం

మొక్కజొన్న పంటకు సాగునీరు సక్రమంగా సమయానికి అందిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. నీరు ఉందని అధిక మొత్తంలో నీటిని అందిస్తే పంట పాడవుతుంది. విత్తనాలను విత్తిన తరువాత తేలిక తడి మాత్రమే ఇవ్వాలి. నీరు నిల్వమాత్రం ఉండకూడదు. నిల్వ ఉంటే విత్తనం మొలకెత్తదు. 30 నుంచి 40రోజులు పంటకు ఎక్కువనీరు పెట్టకూడదు. ముఖ్యంగా మొక్కజొన్న పంట పూతదశకు ముందు, పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో నీరు సక్రమంగా అందించాలి.

ఎరువుల వినియోగం ఇలా..

మొక్కజొన్న పంటకు మిగిలిన పంటల కంటే కొంచెం ఎక్కువ మోతాదులో ఎరువులు అందించవలసి ఉంది. ఈ పంట వేసే రైతులు ఆఖరి దుక్కులో ఎకరానికి 20 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్‌ను వేయాలి. ఎకరానికి నత్రజని 48కిలోలు, భాస్వరం 24కిలోలు, పొటాష్ 20 కిలోలు వేయాలి. నత్రజనిని విత్తనం విత్తేటప్పుడు 12కిలోలు, విత్తిన నెలరోజులకు 24 కిలోలు, 50–55రోజులకు 12కిలోలు వేయాలి. భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేయాలి.

దొంగతనం కేసులో నలుగురికి జైలు

కపిలేశ్వరపురం: దొంగతనం నేరారోపణలో విచారణాంశాలు రుజువు కావడంతో నలుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంటిలో రాత్రి సమయంలో బంగారం, వెండి ఆభరణాలు దొంగతనానికి గురయ్యాయంటూ కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి సూర్యకుమారి 2023 జూలై 17న అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి. చంటి కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన కాజులూరుకు చెందిన షేక్ అజీజ్, రాజమహేంద్రవరానికి చెందిన యడ్ల ఉషా సూర్య వెంకట రాకేష్, తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ, ఇంద్రపాలెంనకు చెందిన ముషినాడ గౌరీ మల్లేశ్వరి నేరం చేసినట్లు రుజువైంది. నిందితులకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. బాధితురాలి తరఫున ఏపీపీ విల్లా శ్రీరాములు వాదించారు.

రేపటి నుంచి రోలర్ స్కేటింగ్ పోటీలు

అమలాపురం టౌన్: జిల్లా రోలర్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం బాలయోగి స్కేటింగ్ రింగ్‌లో ఈ నెల 11,12 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి 2వ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు జరుగుతాయని జిల్లా స్కేటింగ్ క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది.

పందలపాకలో భారీ అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం పంచాయతీ చెరువు వద్ద ఎన్‌టీఆర్ విగ్రహం ఎదురుగా కానూరి శంకరరావుకు చెందిన పాత ప్లాస్టిక్ సంచుల గొడౌన్ విద్యుత్ షార్టుస్కరూట్ ఏర్పడి ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్న సమయం కావడంతో గొడౌన్ వద్ద ఎవరూ లేరు. విద్యుత్ షార్టుస్కరుట్ వలన నిప్పులు రావడంతో ఒకసారిగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించిందని అధికారులు తెలిపారు. బాధితుడు శంకరావును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోళ్ల బాబు



నూతన కార్యవర్గం, ఎగ్జిబిటర్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోళ్ల అచ్యుత రామారావు (బాబు) (శివజ్యోతి థియేటర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలో హోటల్‌లో జరిగిన సినీ ఎగ్జిబిటర్ల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కాకినాడ శ్రీలక్ష్మి టాకీస్ శ్రీనుబాబు, కోశాధికారిగా మండపేట సత్యశ్రీ రాంబాబు, ఉపాధ్యక్షులుగా పిఠాపురం సత్య థియేటర్ చినబాబు, ద్రాక్షారామ సదాశివరావు, సంయుక్త కార్యదర్శిగా లక్కవరం వేణుగోపాల్ థియేటర్ నాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు 8మంది సభ్యులతో కూడిన కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో బాధితురాలి ఆర్తనాదం

ఇండియాకు తీసుకురావాలని వేడుకోలు



గుబ్బల కుమారి

పి.గన్నవరం: జీవనోపాధి నిమిత్తం బెహ్రయిన్ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న ఓ మహిళ తనను స్వగ్రామానికి తీసుకురావాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. బెహ్రయిన్‌లో ఆమె పని చేస్తున్న ఇంటి యజమానులు పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నానని, ఇండియాకు తిరిగి తీసుకురావడానికి ఏజెంట్లు రూ.లక్ష అడుగుతున్నారని రోదిస్తూ ఆమె నాలుగు రోజుల క్రితం వాట్సాప్‌లో పెట్టిన వీడియో వైరల్ అయ్యింది. వివరాలివీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక గ్రామానికి చెందిన గుబ్బల వీర రాఘవులు భార్య కుమారి జీవనోపాధి నిమిత్తం గతంలో కువైట్ దేశానికి వెళ్లి, 20 ఏళ్ల పాటు పని చేసింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల కిందట కుమార్తె మరణించడంతో కుమారి స్వగ్రామానికి తిరిగి వచ్చి ఇక్కడే ఉండిపోయింది. నాలుగు నెలల క్రితం జిల్లాలోని రామచంద్రపురానికి చెందిన ఏజెంట్ వెంకటకృష్ణ, కాకినాడకు చెందిన కాశీ, లక్ష్మిల ద్వారా బెహ్రయిన్ వెళ్లేందుకు ఆమె సిద్ధమైంది. డబ్బులు చెల్లించనవసరం లేకుండా బెహ్రయిన్‌కు పంపిస్తామని, నెలకు రూ.30 వేల జీతం ఇస్తారని చెప్పిన ఏజెంట్లు.. తీరా ఎయిర్‌పోర్టుకు వెళ్లేసరికి రూ.లక్ష డిమాండ్ చేశారని ఆమె భర్త రాఘవులు గురువారం విలేకరులకు వివరించాడు. దీంతో గత్యంతరం లేక అప్పటికప్పుడు అప్పు చేసి రూ.లక్ష చెల్లించామన్నాడు. బెహ్రయిన్‌లో నాలుగు నెలలు పని చేసినా తనకు జీతం ఇవ్వలేదని, ఇంటి యజమానులు నానా ఇబ్బందులూ పెడుతున్నారని, తిండి కూడా సరిగా పెట్టడం లేదని, నలుగురు వ్యక్తులు చేయాల్సిన పనిని తనతో చేయిస్తున్నారని రోదిస్తూ కుమారి చేసిన వాట్సాప్ వీడియో కాల్‌ను ఆమె భర్త రాఘవులు రికార్డు చేశాడు. వాట్సాప్‌లో పెట్టడంతో ఆ వీడియో కాస్తా వైరల్ అయ్యింది. తన భార్య అనారోగ్యంతో బాధ పడుతోందని, ఫిట్స్ కూడా వస్తున్నాయని భర్త వివరించాడు. ఆమెను ఇండియాకు తిరిగి తీసుకువచ్చేందుకు ఏజెంట్లు రూ.లక్ష ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పాడు. ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న తనకు అంత స్తోమత లేదని వివరించాడు. తన భార్యను క్షేమంగా ఇంటికి తీసుకు రావాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతూ రాఘవులు గత సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గోదావరి కాలువలోకి దూకి వ్యక్తి గల్లంతు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో దూకిన ఒక వ్యక్తి గల్లంతు అయిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం పెదపూడికి చెందిన షేక్ సలీమ్ (36) ఒక మహిళతో వచ్చి రైల్వే గేటు ఎదురుగా ఉన్న గోదావరి కాలువపై ఉన్న నూతన వంతెన నుంచి గోదావరి కాలువలోకి దూకాడు. ఆ సమయంలో సలీమ్‌తో వచ్చిన మహిళకు తన సెల్‌ఫోన్ అతను ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అదే సమయంలో పంచారామ క్షేత్రం నుంచి వస్తున్న కానిస్టేబుల్ విషయాన్ని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాంతో సీఐ ఎ.దుర్గాప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. సలీమ్ గోదావరి కాలువలోకి దూకిన విషయాన్ని భార్య ఈశ్వరికి పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనా ప్రదేశానికి చేరుకున్న ఈశ్వరి విషయం తెలిసి స్పృహ తప్పి పడిపోయింది. ట్రాఫిక్ ఎస్సై స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

యువర్స్



చిన్నప్పుడు కన్న కలలు నిజం అవుతాయా? మనసు పెడితే, కష్టపడితే 'కచ్చితంగా నిజం అవుతాయి' అని చెప్పడానికి బలమైన ఉదాహరణ కాజల్, హితేంద్రసింగ్. 'స్పాన్టిక్' స్టార్టప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు... రాకెట్‌ను ప్రయోగించే ప్రక్రియలో కాలంతో పాటు ఎంతో పురోగతిని చూస్తున్నాం. దీనికి సరికొత్త చేర్పు...స్పాన్టిక్. రీయూజబుల్ రాకెట్ లాంచ్ వెహికిల్స్ కోసం కాజల్ రాజ్జర్, హితేంద్రసింగ్ 'స్పాన్టిక్' అనే స్టార్టప్‌ను ప్రారంభించారు.

● ఇన్నోవేషన్

స్కై స్టార్స్


● హితేంద్రసింగ్ ● కాజల్

'పునర్వినియోగ రాకెట్ లాంచ్ వెహికిల్స్‌ను స్పాన్టిక్ అభివృద్ధి చేస్తుంది. అంతరిక్ష పరిశోధనలను అందరికీ మరింత అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. మేము దీన్ని ఫెడెక్స్ టు స్పేస్ అని పిలవడానికి ఇష్టపడతాం' అంటున్నారు కాజల్, హితేంద్రసింగ్.

ఢిల్లీ కేంద్రంగా మొదలైన 'స్పాన్టిక్' ఇప్పటికే గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రభుత్వ గ్రాంట్లను పొందింది. ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. మోస్ట్ ప్రామిసింగ్ స్టార్టప్ 'టెక్ 30' జాబితాలో చోటు సాధించింది.

చిన్నప్పుడు పిల్లలు ఏవో కలలు కంటారు. అయితే ఆ కలలు అన్నీ నిజం కాకపోవచ్చు. చిన్న వయసులోనే 'నేను పెద్దయ్యాక స్పేస్ కంపెనీ నడపాలనుకుంటున్నాను' అని తండ్రితో చెప్పింది కాజల్.

అంతేకాదు 'సొంతంగా రాకెట్లు, ఉపగ్రహాలు తయారు చేస్తాను' అని తన డైరీలో కూడా రాసుకుంది. తన లక్ష్యసాధనలో భాగంగా చెన్నైలోని ఎస్ఆర్ఎంలో చేరింది.

అక్కడ ఫిజిక్స్ చదువుకున్న కాజల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని నడిపేది. కొత్త శాస్త్రీయ ఆవిష్కరణల గురించి అందులో రాసేది. ఈ క్రమంలో కాజల్‌కు అహ్మదాబాద్‌లో చదువుకుంటున్న హితేంద్ర సింగ్‌తో పరిచయం అయింది. కాజల్‌లాగే సింగ్ కూడా చిన్నప్పుడు ఎన్నో కలలు కనేవాడు.

సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన కాజల్, హితేంద్రసింగ్‌లు సైన్స్‌కు సంబంధించి బోలెడు విషయాలు మాట్లాడుకునేవారు. అలా 'స్పాన్టిక్' కోసం స్కెచ్ వేశారు.

ఆస్ట్రోఫిజిక్స్, కాస్మోలజీలో మాస్టర్స్ చేయడానికి గుజరాత్‌లోని 'చరోతార్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' చేరారు. తమ భవిష్యత్ లక్ష్యమైన 'స్పాన్టిక్' కోసం కాలేజీ వదిలిపెట్టారు. కంపెనీ స్థాపించడానికి ముందు మానవ రహిత వైమానిక వాహనాలను (ఏరియల్ వెహికిల్స్) అభివృద్ధి చేయడం నుంచి యువిసి రోవర్ తయారీ వరకు ఎంతో అనుభవ జ్ఞానాన్ని సంపాదించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం 'స్పాన్టిక్' వడివడిగా అడుగులు వేయడానికి ఉపయోగపడింది. రీసైకిల్ చేయదగిన రాకెట్‌ల డిమాండ్‌ను అర్థం చేసుకోవడానికి ప్రైవేట్ సంస్థలు, ఇస్రో సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. నిజానికి పునర్వినియోగ రాకెట్ కాన్సెప్ట్ కొత్త కాదు. రష్యా, అమెరికా, జర్మనీలాంటి దేశాలు దశాబ్దాలుగా ఈ కాన్సెప్ట్‌పై పనిచేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఖర్చు హద్దులు దాటేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కువగా ఖర్చు కాని, ఎక్కువ సార్లు ఉపయోగించే రాకెట్‌లపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం కాజల్-సింగ్ బృందం వర్టికల్ టేకాఫ్ వర్టికల్ ల్యాండింగ్ (విటివిఎల్)ను నిర్మిస్తోంది. వ్యవస్థల పునర్వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

అయినా సరే...

చాలామంది స్పేస్ స్టార్టప్ వ్యవస్థాపకులు ఇస్రోలో పనిచేశారు. లేదా ఏదో ఒక హోదాతో సంస్థతో టచ్‌లో ఉన్నారు. మేము 'ఇస్రో'లో పనిచేయలేదు. 'ఇస్రో'లో పనిచేయని ఫౌండర్‌లకు సంబంధించిన స్టార్టప్ మాది. కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంపై దృష్టి పెట్టాం. ప్రసిద్ధ సంస్థలకు చెందని వ్యక్తులు కూడా సాంకేతిక స్టార్టప్‌లకు సంబంధించి ముందుకు వెళ్లగలరని నిరూపించాలనుకుంటున్నాం. ఇది ఎంతో మంది ఔత్సాహికులకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.
- కాజల్

● టెక్.. టాక్

హానర్ మ్యాజిక్ 7 లైట్



సైజ్: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 6,600 ఎంఏహెచ్ ర్యామ్: 8జీబీ స్టోరేజ్: 256 జీబీ
వోఎస్: ఆండ్రాయిడ్ 14 బరువు: 189 గ్రా.



రెడ్ మీ బుక్ 14

స్క్రీన్: 16:10
రిజల్యూషన్: 2,880×1,800 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 56 డబ్ల్యూహెచ్

సినీబీమ్ ఎస్(పీయు 615 యు) ఎల్‌జీ ప్రొజెక్టర్



● రిజల్యూషన్: 4కే యుహెచ్‌డీ(3,840×2,160) ● స్క్రీన్ సైజ్: 30-120 అంగుళాలు 40-100 అంగుళాలు ● ఆటో స్క్రీన్ అడ్జస్ట్‌మెంట్ స్పేస్ ● బరువు: 7.5 కేజీ(పిఎఫ్600 యు) 2.5కేజీ (పియు615యు) ● సపోర్ట్: డల్బీ ఆటోమస్ సౌండ్ ● లైట్ వెయిట్ డిజైన్

డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...

ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్‌లను అందుబాటులోకి తెస్తోంది. ఈ యాప్‌లో ఎన్నో ఫీచర్‌లు ఉన్నప్పటికీ డాక్యుమెంట్‌లను స్కాన్ చేసి పంపడానికి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్‌తో ఐఫోన్ యూజర్‌ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది వాట్సాప్. ఇన్-యాప్ కెమెరాను ఉపయోగించి డాక్యుమెంట్లను స్కాన్ చేసి, వారి కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న ఎవరితోనైనా షేర్ చేసుకునే అవకాశం కల్పిస్తుంది.



వాట్సాప్‌లో డాక్యుమెంట్స్ స్కాన్ చేయడానికి...
● వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత బాటమ్ బార్‌లోని 'బటన్'ను నొక్కాలి. ● డాక్యుమెంట్స్-సెలెక్ట్ ● 'చూజ్ ఫ్రమ్ ఫైల్స్' 'చూజ్ ఫోటోస్ ఆర్ వీడియో' 'స్కాన్ డాక్యుమెంట్' అనే మూడు ఆప్షన్‌లు కనిపిస్తాయి ● థర్డ్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఇన్-కెమెరా ఓపెన్ అవుతుంది ● స్కాన్ చేసిన తరువాత ఇతరులకు షేర్ చేయవచ్చు.



అవును... ఇది నిజమే!

● 'యస్...ఈ పని నేను కచ్చితంగా చేయగలను' అని ఒకటికి పదిసార్లు గట్టిగా అనుకోవడం మనం చేసే పనిపై సానుకూల ప్రభావం చూపుతుంది అంటున్నారు వ్యక్తిత్వ వికాస నిపుణులు.
● జపాన్‌లో 'హిరోషిమా పీస్ ఫ్లేమ్' 1964 నుంచి నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. ● జపాన్‌లో 'థ్యాంకు యూ'కు ప్రత్యామ్నాయంగా '39' వాడుతారు.

● గేమింగ్

అపురూప అగ్నితేజం

ఫైనల్ ఫాంటసీ 7(ఫర్ పీసీ) రీబర్త్ ఈ నెలలో విడుదల కానుంది. 'ఫైనల్ ఫాంటసీ 7 రిమేక్'కి సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. రియల్-టైమ్ యాక్షన్‌కు స్ట్రాటజిక్, రోల్-ప్లేయింగ్ ఎలిమెంట్స్ జోడించి రూపొందించిన ఈ గేమ్‌లో క్లౌడ్ స్ట్రైఫ్(ఫైనల్ ఫాంటసీ సిరీస్‌లో ప్రధాన పాత్ర) పార్టీ ఆఫ్ క్యారెక్టర్లు(రెడ్, విన్‌సెంట్, సిడ్, టిఫా, బారెట్...మొదలైన క్యారెక్టర్స్) ప్లేయర్స్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.

మునుపటి గేమ్‌లలోని ప్రధాన క్యారెక్టర్లు తాజా గేమ్‌లో కూడా కనిపిస్తాయి.



సిరీస్: ఫైనల్ ఫాంటసీ ఇంజిన్: అన్‌రియల్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్ జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్-ప్లేయర్

● యంగ్ టాలెంట్

వండర్ బాయ్

టైమ్ మేనేజ్‌మెంట్ తెలిస్తే ఎంతో టైమ్ సేవ్ అవుతుంది. ఆ టైమ్‌లో ఎన్నో విద్యలు నేర్చుకోవచ్చు. 'శభాష్' అనిపించుకోవచ్చు... దీనికి ఉదాహరణ తపస్వీరెడ్డి

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి కరాటే, ఫ్యాన్సీ డ్రెస్, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చదరంగం, ఫోటోగ్రఫీ, సైన్స్, డ్యాన్స్....మొదలైన వాటిలో ప్రతిభ చూపుతున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఒలింపియాడ్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచాడు. వియత్నాంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సుకు ఎంపికయ్యాడు.

వందకి పైగా జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు, తేదీలు వాటికి సంబంధించిన వివరాలను చెప్పి అంతర్జాతీయ 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ -2024లో అండర్ -14 బ్లాక్‌బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటేలో కాంస్య పతకం గెలుచుకున్నాడు.

ఇస్రో అంతరిక్ష వారోత్సవాలు 2023ను పురస్కరించుకుని తణుకులో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో, రాజమండ్రిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో 674 మందితో పోటీపడి ఐదో స్థానంలో నిలిచి ప్రశంస పత్రం అందుకున్నాడు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్ నాలెడ్జ్ ఒలింపియాడ్ 2023-24 రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ వారు నిర్వహించిన ఫాన్సీ డ్రెస్ పోటీలో మహాత్మా గాంధీ వేషధారణతో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. యువజన మహోత్సవాల్లో భాగంగా ఫ్యాన్సీడ్రెస్ పోటీలో కృష్ణుడి వేషధారణలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

– గాడి శేఖర్ బాబు, నిడదవోలు, సాక్షి

సాక్షి సినిమా



కావేరి పాత్ర నాకో సవాల్

– ప్రగ్యా జైస్వాల్

''డాకు మహారాజ్'లో నేను కావేరి పాత్ర చేశాను. నటనకు ఆస్కారం ఉన్న మంచి క్యారెక్టర్ ఇది. మొదటిసారి డీ గ్లామరస్ రోల్ చేశాను.. నేనిప్పటి వరకు చేసిన పాత్రలకు భిన్నంగా ఈ క్యారెక్టర్‌ని బాబీగారు అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ పాత్ర చేయడం నాకు సవాల్‌గా అనిపించింది'' అని ప్రగ్యా జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రగ్యా జైస్వాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''2015లో 'కంచె' సినిమాతో తెలుగులో నా ప్రయాణం మొదలైంది. ఈ ప్రయాణంలో సినిమా గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. బాలకృష్ణగారితో 'అఖండ, డాకు మహారాజ్, అఖండ-2'.. ఇలా వరుస సినిమాలు చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో నటించడం హ్యాపీగా ఉంది. ఈ నెల 12న నా పుట్టినరోజు. నేను నటించిన 'డాకు మహారాజ్'అదే రోజు రిలీజ్ కావడం నా లక్'' అని చెప్పారు.

''చిన్న సినిమా, పెద్ద సినిమా... దేనికైనా మంచి కథే ప్రాణం. నా కెరీర్ ఆరంభం నుంచి కూడా కథను నమ్ముకునే సినిమాలు తీశాను. ఈ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదు. మా అబ్బాయి అనంత కిశోర్ నిర్మించిన 'తల్లి మనసు' సినిమా అద్భుతమైన కథతో రూపొందింది. ప్రతి తల్లి, కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రం ఇది'' అని ప్రముఖ సీనియర్ దర్శకులు, చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య చెప్పారు. రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల సుబ్బయ్య వద్ద దర్శకత్వ విభాగంలో పని చేసిన వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య విలేకరులతో పంచుకున్న విశేషాలు.



కుటుంబమంతా తల్లి మనసు చూడాలి

– ముత్యాల సుబ్బయ్య

● దర్శకుడిగా నా తొలి చిత్రం 'మూడుముళ్ల బంధం'తో మంచి పేరు వచ్చింది కానీ అవకాశాలు రాలేదు. ఆ తర్వాత టి. కృష్ణగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ తర్వాత నేను దర్శకత్వం వహించిన 'అరుణ కిరణం' (1986) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రముఖ హీరోలందరితోనూ సినిమాలు తీశాను. దర్శకుడిగా 50 సినిమాలు తీశాను.. వాటిలో అద్భుతమైన హిట్‌తో పాటు కొన్ని ఫెయిల్యూర్స్ లేకపోలేదు. అయినప్పటికీ ఏ రోజూ ఏదో సినిమా చేసెయ్యాలని, చుట్టేయాలని అనుకోలేదు. సమాజానికి ఉపయోగపడే పాయింట్‌తో పాటు సెంటిమెంట్, కామెడీ, డ్రామా వంటి అంశాలను మేళవించి సినిమాలు చేశాను. సెంటిమెంట్ సినిమాల కారణంగా నాకు సెంటిమెంట్ సుబ్బయ్య అని పేరొచ్చింది ● నిర్మాతగా నేను ఒక్క సినిమా కూడా తీయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిశోర్‌కు ఒక మంచి సినిమా తీయాలనే అభిరుచి ఉండటంతో 'తల్లి మనసు' నిర్మించాం. నేను సీనియర్ దర్శకుడిని అయినప్పటికీ శ్రీనివాస్‌కి సూచనలు, సలహాలు ఇచ్చానే తప్ప ఎక్కడా కల్పించుకోలేదు. నా మనసుకి సంతృప్తినిచ్చిన చిత్రమిది. థియేటర్ నుంచి బయటికి వచ్చిన తర్వాత 'ఓ మంచి సినిమా చూశాం' అని ప్రేక్షకులు అనుకుంటారు.

నా లక్ష్యం నెరవేరింది

– కృష్ణ కాంత్



''తెలుగు సినిమాలకు నేరుగా పాటలు రాయడం సులభం. పైగా కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ, డబ్బింగ్ సినిమాలకు పాటలు రాసేటప్పుడు ఆయా భాషలో వాడిన పదాలకు సరిపోయే తెలుగు పదాలను ఎంచుకుని రాయాలి. అందుకే స్ట్రయిట్ సాంగ్స్‌తో పోలిస్తే డబ్బింగ్ పాటలు రాయడం చాలా కష్టం'' అని పాటల రచయిత కృష్ణకాంత్ (కేకే) చెప్పారు. నేడు (జనవరి 10) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా గురువారం కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ– ''పాటల రచయితగా పేరు తెచ్చుకోవాలని ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. ఆ లక్ష్యం నెరవేరిందనే సంతృప్తి కలుగుతోంది. 2024లో నేను రాసిన స్ట్రయిట్, డబ్బింగ్ పాటలన్నీ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుని వైరల్‌గా మారడం సంతోషంగా ఉంది. ఒక సినిమా కథ మొత్తం తెలిస్తే పాటల రచయితకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలా నేను సింగిల్ కార్డ్ రాసిన 'పడి పడి లేచె మనసు, సీతారామం (ఐదు పాటలు), సలార్, రాధే శ్యామ్' సినిమాల పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. గతేడాది నేను రాసిన పాటల్లో 'హాయ్ నాన్న'లోని 'అడిగా..' పాట బాగా సంతృప్తిని ఇచ్చింది. మలయాళ డబ్బింగ్ మూవీ 'ఏఆర్ఎం', రజనీకాంత్‌గారి 'వేట్టయాన్', శివకార్తికేయన్‌గారి 'అమరన్' సినిమాలకు రాసిన పాటలకు మంచి పేరొచ్చింది. సాటి గీత రచయితలు నాతో స్నేహంగా ఉంటారు. నేను మంచి పాట రాసినప్పుడు చంద్రబోస్ గారు అభినందిస్తారు. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ 'అధీర' మూవీకి డైలాగ్స్ రాస్తున్నాను. 'రాజాసాబ్', ప్రభాస్-హను రాఘవపూడి, రామ్ పోతినేని, విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి చిత్రాలకు పాటలు రాస్తున్నాను'' అని చెప్పారు.

సాయికుమార్ గోల్డెన్ జూబ్లీ



''కనిపించే ఈ మూడు సింహాలు న్యాయానికి, నీతికి, ధర్మానికి ప్రతిరూపాలైతే, కనిపించని ఆ నాలుగో సింహమేరా.. పోలీస్...' అనే డైలాగ్ వింటే... వెంటనే సాయికుమార్ అని ఆడియన్స్ చెప్పేస్తారు. అంటూ 'పోలీస్ స్టోరీ'లో ఆయన తనదైన శైలిలో పవర్‌ఫుల్‌గా చెప్పి, ఆకట్టుకున్నారు. నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న సాయికుమార్ ఇండస్ట్రీలోకి వచ్చి యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సాయికుమార్ గురించి కొన్ని విశేషాలు...


1972 అక్టోబరు 20న 'మయసభ' అనే నాటకంలో దుర్యోధనుడి పాత్ర కోసం తొలిసారి మేకప్ వేసుకున్నారు సాయికుమార్. ఆయన వెండితెర ప్రయాణం 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో జరిగింది. బాపు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయికుమార్ బాలనటుడిగా చేశారు. ఈ మూవీ 1975 జనవరి 9న రిలీజైంది. గురువారంతో (జనవరి 9) వెండితెరపై సాయికుమార్ యాభైఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ముందు డబ్బింగ్ ఆర్టిస్టుగానే కెరీర్ మొదలుపెట్టారు సాయికుమార్. ఆ తర్వాత 'ఛాలెంజ్, కలికాలం, మేజర్ చంద్రకాంత్' వంటి తెలుగు సినిమాల్లో నటిస్తూనే, 'తయ్యల్‌క్కారన్, కావల్ గీతమ్' వంటి తమిళ సినిమాల్లోనూ నటించారు. 1996లో సాయికుమార్ హీరోగా వచ్చిన కన్నడ చిత్రం 'పోలీసు స్టోరీ' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలోని సాయి కుమార్ నటనకు ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో అనువాదమై, విజయం సాధించింది. 'పోలీసు స్టోరీ' తర్వాత ఆయన పాతిక చిత్రాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇక తెలుగులో 'అమ్మ రాజీనామా, కర్తవ్యం, అంతఃపురం, ఈశ్వర్ అల్లా, జగద్గురు ఆది శంకర, ఎవడు, పటాస్, పండుగ చేస్కో, భలే మంచి రోజు, సరైనోడు, జనతా గారేజ్, ఓం నమో వెంకటేశాయ, జై లవ కుశ, రాజా ది గ్రేట్, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా, మహర్షి, ఎస్ఆర్ కల్యాణమండపం, దసరా, సార్...' ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో సాయికుమార్ నటించారు. 50 ఏళ్ల కెరీర్‌లో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన సాయికుమార్ విలన్‌గానూ నిరూపించుకున్నారు. 'సామాన్యుడు, ప్రస్థానం, ఎవడు..' వంటి చిత్రాల్లో విలన్‌గా చేశారు. కేవలం వెండితెరకు మాత్రమే పరిమితం కాకుండా, బుల్లితెరపై రాణిస్తున్నారు సాయికుమార్. ఇక ఆయన తమ్ముళ్లు అయ్యప్ప పి.శర్మ, పి. రవిశంకర్ డబ్బింగ్ ఆర్టిస్టులుగా, నటులుగా సినిమా రంగంలోనే రాణిస్తున్నారు. ఆయన కొడుకు ఆది సాయికుమార్ హీరోగా చేస్తున్నారు.

థ్రిల్లింగ్ బూమరాంగ్


● అనూ ఇమ్మాన్యుయేల్

అనూ ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రలో, శివ కందుకూరి, 'వైవా' హర్ష, 'వెన్నెల' కిశోర్, ఎస్. నివాసిని, షానీ సాల్మన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బూమరాంగ్'. ముప్పై సినిమాలకుపైగా సినిమాటోగ్రాఫర్‌గా చేసిన ఆండ్రూ బాబు 'బూమరాంగ్' మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా. ప్రవీణ్ రెడ్డి వూట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్ నిర్వహిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హీరో వెంకటేశ్ రిలీజ్ చేశారు. ''కర్మ ఇతివృత్తాన్ని రెండు సమాంతర కథాంశాలతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమాను తీస్తున్నాం. ఈ సినిమా ఆడియన్స్‌కు మంచి అనుభూతినిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.

సింగర్ జయచంద్రన్ మృతి



ప్రముఖ గాయకుడు పి.జయచంద్రన్(80) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కేరళలోని త్రిసూర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, గురువారం తుది శ్వాస విడిచారు. 1944 మార్చి 3న కొచ్చిలో జన్మించిన జయచంద్రన్ 1965లో వచ్చిన 'కుంజలి మరక్కర్' అనే సినిమాలోని 'ఒరు ముల్లప్పుమలమే..' పాటతో గాయకుడిగా పరిచయమయ్యారు. 1967లో విడుదలైన 'కలితోజన్' చిత్రంలోని 'మంజలైల్ ముంగి తోర్తి' పాట ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి. ఆరు దశాబ్దాలకుపైగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 16 వేలకుపైగా పాటలు పాడారాయన. జయచంద్రన్ తెలుగులో పాడిన'రోజావే చిన్ని రోజావే (సూర్యవంశం), అనగనగా ఆకాశం ఉంది (నువ్వే కావాలి), హ్యాపీ హ్యాపీ బర్త్‌డేలు (సుస్వాగతం)' వంటి పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 2002లో వచ్చిన 'ఊరు మనదిరా'లో పాడిన 'నా చెల్లి చంద్రమ్మ' తెలుగులో ఆయన చివరి పాట. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, ఎం.ఎం. కీరవాణి, విద్యాసాగర్, కోటి వంటి సంగీత దర్శకుల సినిమాలకు ఆయన ఎక్కువగా పాటలు పాడారు. హిందీలో ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన 'అదా: ఎ వే ఆఫ్ లైఫ్' అనే ఒకే ఒక మూవీలో పాడారు జయచంద్ర. అదేవిధంగా తన మాతృ భాష మలయాళంలో 'నఖక్ష తంగళ్', 'త్రివేంద్రం లాడ్జ్' వంటి సినిమాల్లో అతిథి పాత్రల్లో మెరిశారాయన. అంతేకాదు.. 'శ్రీ నారాయణ గురు' అనే మలయాళ సినిమాలోని 'శివ శంకరా సర్వ శరణ్య విభో..' పాటకుగానూ 'బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్'గా 1986లో జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే ఐదు కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, రెండు తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డులు కూడా ఆయన్ని వరించాయి. జయచంద్రన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, గాయకులు సంతాపం తెలిపారు.